మూడు గంటలకో రేప్, ఆరు గంటలకో మర్డర్

- రోజుకు ఐదు కిడ్నాప్‌లు, విచ్చలవిడిగా దోపిడీలు, మోసాలు
- ప్రత్యర్థులను నడిరోడ్లపై యథేచ్ఛగా నరుకుతున్న గూండాలు
- మహిళలు, చిన్నారులపై దారుణాలు, అకృత్యాలు, వేధింపులు
- ఏడాదిలోనే భారీగా 22.53 శాతం పెరిగిన తీవ్రమైన నేరాలు
- ఉగ్రవాదులొచ్చి నెలల తరబడి ఉన్నా పట్టుకోలేని అలసత్వం
- సీఎం రేవంత్ వద్దనే హోంశాఖ, పట్టించుకోవట్లేదని విమర్శలు
- నిఘా లోపాలు, పాలన వైఫల్యాలు కారణమంటున్న నిపుణులు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో నేరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. మోసాలు, దొంగతనాల నుంచి లైంగిక దాడులు, హత్యల వరకు, పల్లెల నుంచి పట్టణాల వరకు ఎక్కడ చూసినా నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఏడాదిలో జరిగిన నేరాల చిట్టా చూస్తే పరిస్థితులు ఎంత భయానకంగా ఉన్నాయో అర్థమవుతున్నది. ఇటీవల నడిరోడ్లపై నరుక్కోవడాలు, మహిళలపై అకృత్యాల కేసులు పెరిగిపోయాయి. నేరాలు భారీగా పెరిగిపోవడంపై శాంతిభద్రతల నిపుణులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, మానవహక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో తెలంగాణ జంగిల్‌రాజ్‌గా మారిపోయిందని సామాజికవేత్తలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం, పోలీసుశాఖ లెక్కల ప్రకారమే తీవ్రమైన నేరాల్లో 22.53 శాతం పెరుగుదల కనిపించడం ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు.

హత్యలు... లైంగిక దాడులు... కిడ్నాప్‌లు

- తెలంగాణలో కాంగ్రెస్ ఏడాది పాలనలో 1,161 హత్యలు జరిగాయి. హత్యకు గురైన వాళ్లలో 250 మంది
- మహిళలు ఉన్నారు. 2,945 మంది మహిళలపై లైంగిక దాడులు జరిగాయి. మొత్తం 8,973 వరకట్న వేధింపుల కేసులు
- నమోదయ్యాయి. 1,122 మంది మహిళలు కిడ్నాప్‌నకు గురయ్యారు. 380 మంది మహిళలు ఆత్మహత్యకు పాల్పడ్డారు.
- ప్రభుత్వ గణాంకాల ప్రకారమే మూడు గంటలకో రేప్, ఆరు గంటలకో మర్డర్ జరుగుతున్నాయని స్పష్టమవుతున్నది.
- రికార్డులకెక్కని మరిన్ని నేరాలు ఉన్నాయని సామాజిక కార్యకర్తలు చెప్తున్నారు. మహిళలకు అండగా నిలుస్తామంటూ గద్దెనెక్కిన
- కాంగ్రెస్ పార్టీ సర్కారు తీసుకొచ్చింది ఇంది రమ్మ రాజ్యం కాదని.. గూండాల రాజ్యమని మహిళా సంఘాల నేతలు విమర్శిస్తున్నారు.

నడిరోడ్డుపైనే నరికేస్తున్నారు

గూండాలు, రౌడీషీటర్లు, పాత నేరస్తులు రెచ్చిపోతున్నారు. ప్రత్యర్థులను నడిరోడ్డుపైనే నరికేస్తున్న ఘటనలు తరచుగా జరుగుతున్నాయి. పాత నేరస్థులపై పోలీసుల నిరంతర పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణమని రిటైర్డ్ పోలీసు అధికారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. పదేండ్ల పాటు పత్తాలేకుండా పోయిన పాతనేరస్థులు మళ్లీ దందాలు మొదలుపెట్టారని వివిధ కేసులలో బయటపడుతున్నది. సెటిల్మెంట్లు, సుపారీ హత్యలు, పాత పగలతో ప్రత్యర్థులను మట్టుబెట్టడం వంటి నేరాలకు తెగబడుతున్నారని ఇటీవలి పలు ఘటనల్లో స్పష్టమైంది. భూవివాదాల్లో ఘర్షణలు కూడా పెరిగిపోతున్నాయి. కట్టడి చేయాల్సిన పోలీసులు సివిల్ కేసులలో తలదూర్చి, కబ్జాకోరులకు కొమ్ముకాస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెరిగిన క్రైమ్ రేట్.. తగ్గిన శిక్షలు!

2023లో కేసుల్లో 39,371 కేసులలో దోషులకు శిక్ష పడింది. 2024లో చూసుకుంటే 28,477 కేసులలో మాత్రమే శిక్ష పడిందని, ఇది 27.67 శాతం తగ్గుదల అని న్యాయనిపుణులు చెప్తున్నారు. కేసుల దర్యాప్తు, ఆధారాల సేకరణ, పకడ్బందీగా అభియోగపత్రాలు దాఖలులో పోలీసులు అనుసరించే విధానాలను బట్టే దోషులకు శిక్షలు పడతాయని వివరిస్తున్నారు. రాష్ట్రంలో దొంగలు తిష్టవేశారని పలు కేసులలో బయటపడ్డా, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం, పోలీసులు పట్టించుకోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

తగ్గిన డయల్ 100 రెస్పాన్స్

కేసీఆర్ ప్రభుత్వంలో పోలీసులకు విస్తృతంగా మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రత్యేక వాహనాలు, సాంకేతిక పరికరాలు అందించారు. దీంతో ఆపదలో ఉన్న ప్రజలకు శరవేగంగా సేవలు అందించే వీలు కలిగింది. కానీ ప్రస్తుతం పర్యవేక్షణ లోపం, పాలన వైఫల్యం వల్ల డయల్ 100 స్పందన తగ్గిందని బాధితులు చెప్తున్నారు. 2022లో డయల్ 100 రెస్పాన్స్ టైమ్ 5-6 నిమిషాలు ఉండేది. కానీ 2024లో ఆ సమయం 7 నిమిషాలకు చేరుకోగా ప్రస్తుతం 15 నిమిషాలు పడుతున్నదని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అడుగడుగునా నిఘా వైఫల్యం

రాష్ట్రంలో అడుగడుగునా నిఘా వైఫల్యం కనిపిస్తున్నదని శాంతిభద్రతల నిపుణులు చెప్తున్నారు. సీఎం ఆధ్వర్యంలో హోంశాఖ ఉన్నా పర్యవేక్షణ, సమీక్షలు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఓ ఉగ్రవాది 6నెలలుగా తలదాచుకున్నట్టు తేలింది. ఢిల్లీ నుంచి ఎన్ఐఏ అధికారులొచ్చి అతడిని అరెస్టు చేశారు. ఆ దుండగుడు ఆరు నెలల్లో ఏదైనా విధ్వంసానికి పాల్పడి ఉంటే పరిస్థితి ఏంటని రిటైర్డ్ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మన పోలీసులు నిఘాలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నిస్తున్నారు.

నేరం జరిగే వరకు అంచనా వేయరా?

కాంగ్రెస్ పాలనలో హైదరాబాద్ పాతబస్తీ, బోడుప్పల్, మెదక్, జైనూర్, ఖైరుంతాబాద్ సహా 9 చోట్ల మత ఘర్షణలు జరిగాయి. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంపై దాడి ఘటన సంచలనంగా మారింది. మియాపూర్‌లోని హెచ్ఎండీఏ భూముల్లో పేదలకు ఇండ్ల స్థలాలు పంచుతున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరిగింది. దీంతో భారీగా జనం అక్కడికి చేరి, 3 రోజుల పాటు తిష్టవేశారు. పరిస్థితి చివరకు రాళ్లదాడి, లాఠీచార్జికి దారితీసింది. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని ముందే గుర్తించి, ప్రజలకు నిజాలు తెలియజేయడంలో పోలీసులు, అధికారులు విఫలమయ్యారని విమర్శలు ఉన్నాయి. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనలో పోలీసులు లాఠీలు, కర్రలతో విరుచుకుపడ్డారు. అభ్యర్థుల ఆందోళనను పోలీసులు ముందుగా అంచనా వేయలేదు. బెటాలియన్ కానిస్టేబుళ్లు, కుటుంబ సభ్యులు సచివాలయాన్ని ముట్టడించారు. హోంగార్డుల ఆందోళనతో పాటు చాలా ఘటనలలో నిఘా విభాగం అంచనా వేయలేకపోయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

> **ప్రజలకు శాంతి లేదు.. భద్రత లేదు**
>
> రాష్ట్రానికి సమర్థవంతమైన నాయకత్వలేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడేందుకు తక్షణం ఆదేశాలు ఇచ్చే వ్యవస్థ లేకపోవడం, ముఖ్యంగా ప్రత్యేకంగా హోంమంత్రి లేకపోవడంతో తెలంగాణలో నేరాలు దారుణంగా పెరిగిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎటు చూసినా హత్యలు, అత్యాచారాలు, కిడ్నాప్‌లు, దోపిడీలు, నడిరోడ్డుపై కత్తులతో నరుక్కోవడం, కర్రలతో దాడులు చేసుకోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో రోజూ 4 హత్యలు, ప్రతీ 3 గంటలకొక రేప్, రోజూ 5 కిడ్నాప్‌లు జరుగుతున్నాయంటే ప్రజలకు శాంతి లేదు, భద్రత లేదనే విషయం స్పష్టమవుతున్నది.
>
> *-ఓ రిటైర్డ్ పోలీసు అధికారి*

పెరిగిన నేరాలు.. పేట్రేగిన నేరగాళ్లు
(2024 జనవరి నుంచి నవంబర్ వరకు)

వివిధ నేరాలు	2023	2024	పెరిగిన శాతం
1. డబ్బు కోసం హత్యలు	59	83	40.67
2. హత్యలు	789	856	8.49
3. కల్పబుల్ హోమిసైడ్	171	222	29.82
4.లైంగిక దాడులు	2,284	2,945	28.94
5. కిడ్నాప్‌లు	1,362	1,525	11.96
6. దొంగతనాలు	14,393	19,480	35.34
7. దోపిడీలు	495	703	42.02
8. బందిపోటు దొంగతనాలు	42	58	38.09
9. రాత్రివేళ దొంగతనాలు	4,803	5,724	19.17
10. దాడులు	19,551	22,031	12.68
11. మోసాలు	22,996	33,618	46.19
(సైబర్ క్రైమ్ మోసాలు)	(16,339)	(24,643)	(50.82)
12. నేరపూరిత మోసాలు	451	701	55.43
13. ఇతర నేరాలు	70,454	81,194	15.24
13.1 ఎన్డీపీఎస్ కేసులు	1,360	1,950	43.38
13.2 రోడ్డు ప్రమాద మరణాలు	6,541	6,640	1.51
13.3 రోడ్డు ప్రమాద క్షతగాత్రులు	14,161	16,851	19
మొత్తం తీవ్రమైన నేరాలు	1,38,312	1,69,477	22.53



మహిళలపై నేరగాళ్ల పంజా

వివిధ నేరాలు	2023	2024	పెరిగిన శాతం
1. హత్యలు	213	241	13.15%
2. కిడ్నాప్‌లు	884	1,122	26.92%
3. రేప్‌లు	2,284	2,945	28.94%
4. ఆత్మహత్యకు ప్రేరేపించడం	363	379	4.41%
5. అవుటస్టాండింగ్ ఆఫ్ మోడెస్టీ	5,464	5,940	8.71%
10.పీడీ యాక్ట్ కేసులు	4	6	50.00%
మొత్తం	19,013	19,922	13.75%

ముగిసిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ల నేషనల్ వర్క్‌షాప్

19 రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల నుంచి చైర్మన్లు, సభ్యులు హాజరు

హైదరాబాద్, మార్చి 23 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగ నియామకాలలో సమర్థత, పారదర్శకతతో పాటు విశ్వసనీయతను పెంపొందించడంలో 'సాంకేతిక పరివర్తన పాత్ర' అనే అంశంపై కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో ఈనెల 22న ప్రారంభమైన రెండ్రోజుల జాతీయ వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి జాతీయస్థాయిలో 19 రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల నుంచి చైర్మన్లు, సభ్యులతో కలిపి మొత్తం 60మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాపులో టీజీపీఎస్సీ నుంచి చైర్మన్ బుర్రా వెంకటేశంతో పాటు సభ్యులు ప్రొఫెసర్ యాదయ్య, పీ రజనీకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ వెంకటేశం మాట్లాడుతూ.. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, సమర్థవంతమైన విధానాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ప్రాధాన్యత గురించి వివరించారు.



డంపింగ్ యార్డుతో ఆగిన రైతుగుండె

భూముల రేట్లు పడిపోవడంతో మనోవేదన

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం నల్లవల్లికి చెందిన రైతు నడిమింటి కృష్ణ (53)కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తన అర ఎకరం భూమిలో వ్యవసాయం చేయడంతో పాటు రజక పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు బిడ్డల పెండ్లికి రావడంతో తనకున్న అర ఎకరం భూమిని అమ్మకానికి పెట్టాడు. డంప్ యార్డు ఏర్పాటు ఎఫెక్టుతో ఎవరూ ఆ భూమి కొనడానికి ముందుకు రావడంలేదు. దీంతో కొద్దిరోజులుగా ఆందోళనకు గురవుతున్న కృష్ణకు ఆదివారం గుండెపోటు రావడంతో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ప్యారానగర్ డంపింగ్ యార్డు రద్దు చేయాలని 47 రోజులుగా నల్లవల్లిలో రిలే దీక్షలు చేస్తున్నారు. ఫిబ్రవరి 15న నడిమింటి కృష్ణ దీక్షలో పాల్గొన్నారు. ఆ రోజు గ్రామస్తులతో తన బాధను పంచుకున్నాడు. తనకు పెళ్లీడుకు వచ్చిన ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, తాను పెండ్లి చేయాలంటే కేవలం తనకున్న భూములే ఆధారమని, కూతుర్ల పెండ్లి కోసం భూమి విక్రయానికి పెట్టినప్పటికీ ఎవరూ కొనడానికి రావడంలేదని ఆందోళన వ్యక్తం చేశాడు. పెద్ద కూతురు మహేశ్వరి డిగ్రీ చదువుతుండగా, రెండో కూతురు మమత ఇంటర్మీడియట్ చదువుతున్నది. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు.

ఏడాదిన్నరలో ఐదుసార్లు బదిలీ
గుండెపోటుతో తహసీల్దార్ మృతి

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 23: వరుస బదిలీలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఓ ప్రభుత్వాధికారి గుండెపోటుతో మృతిచెందాడు. తోటి ఉద్యోగులు తెలిపిన ప్రకారం నాలుగు రోజుల క్రితం తహసీల్దార్ల బదిలీలలో బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న విజయ్ కుమార్(59)ని ఎల్లారెడ్డి ఆర్డీవో ఆఫీస్‌కు బదిలీ చేశారు. ఈ నెల 24న విధుల్లో చేరాల్సి ఉండగా 22న అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. విజయ్‌కుమార్ స్వగ్రామం ఆర్మూర్. భార్య ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు. భార్యాభర్తలు ఒకే దగ్గర పనిచేసేందుకు అవకాశమున్నా, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాదిన్నరలో ఐదుసార్లు బదిలీ చేశారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిర్మల్ జిల్లాకు బదిలీ చేయడంతో పాటు, మళ్లీ రూల్స్‌కు విరుద్ధంగా ఆదిలాబాద్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. స్పౌస్ కోటాలో నిజామాబాద్‌కు బదిలీకి ప్రయత్నం చేయగా అతడి విజ్ఞప్తిని పట్టించుకోకుండా కామారెడ్డికి బదిలీ చేశారు. అనారోగ్య సమస్యలు ఉన్నాయని తెలిపినా కామారెడ్డి జిల్లాలో మూడు సార్లు బదిలీ చేశారు. తరచూ బదిలీలతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన విజయ్‌కుమార్‌కు గుండెపోటు రావడంతో హైదరాబాద్‌లో దవాఖానకు తరలించగా.. శనివారం అర్ధరాత్రి మృతిచెందారు.

బాలికపై అఘాయిత్యం

- మాయమాటలతో యువకుడి లైంగికదాడి
- గర్భం దాల్చిన బాలిక.. ఫిర్యాదు తీసుకునేందుకు పోలీసుల నిరాకరణ
- బాధితురాలి ఆత్మహత్యాయత్నం
- కుటుంబసభ్యుల రాస్తారోకో, స్టేషన్ ఎదుట ఆందోళనతో కేసు నమోదు

ఎర్రుపాలెం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన గ్రామస్థులు

ఎర్రుపాలెం, మార్చి 23: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో ఓ కామాంధుడి నిర్వాకం వల్ల గర్భం దాల్చిన బాలిక (17) ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి ఫిర్యాదును స్వీకరించేందుకు ఎస్సై నిరాకరించడమే ఇందుకు కారణం. బాధితురాలి కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. భీమవరం హరిజనవాడకు చెందిన ఆ బాలికపై అదే గ్రామానికి చెందిన 27 ఏండ్ల యువకుడు పలుమార్లు లైంగ